క్లుప్తంగా

లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం పాంచరాత్రి ఉత్సవాల్లో భాగంగా జేష్ఠమాసం శుక్రవారం రెండోరోజు లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ ఉత్సవం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం చేపట్టారు. అనంతరం తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, పురోహితులు జనార్ధన శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న కమలాకర్

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్ఆర్ కాలనీలో నిర్మించిన శివాలయంకు మెట్టూరుకు చెందిన మాజీ సైనికుడు గెడ్డవలస కమలాకర్ రూ.20 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. దీంతో ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన



పాడి రైతులతో మాట్లాడుతున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పశుగ్రాసం పెంపకం గురించి పాడి రైతులు తెలుసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఎం.కరుణాకరరావు అన్నారు. మండలంలోని పెద్దసీది గ్రామంలో పాడి రైతులకు పశుగ్రాస పెంపకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఉచిత మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పద్ధతిలో పశుగ్రాస విత్తనాలు భూమిలో చల్లితే భూసారం పెరుగుతుందన్నారు. తద్వారా మొక్కకు అవసరమైన బ్యాక్టీరియా చనిపోకుండా వేసవిలో కూడా కాపాడుకునే వీలు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుణాలమ్మ, పశువైద్య సహాయకుడు శ్యామ్ సుందరరావు, గోపాల్‌మిత్ర రామ్మోహన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నువగడ పంచాయతీలో కలపండి



సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

హిరమండలం: తమ గ్రామాన్ని నువగడ పంచాయతీలో కలపాలని సొలిపి నిర్వాసిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం గ్రామాన్ని సందర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావుకు సమస్యలు వివరించారు. దీనికి ఆయన స్పందించి జిల్లా యంత్రాంగం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు ఢిల్లేశ్వరరావు, రవివర్మ, సూర్యనారాయణ, బాబూరావు తదితరులు ఉన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు తదితరులు

పాతపట్నం: మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం రైతులకు వరి విత్తనాలు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్, పశువైద్య శాఖ ఏడీ కరుణాకరరావు, ఏఏవో భారతి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: ప్రభుత్వం రైతుల ప్రయోజనం దృష్ట్యా రాయితీపై అందించే విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం చల్లవానిపేట పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తర్ర బలరాం, ఏవో కె.సురేష్ కుమార్, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు చెల్లుచీటీ..!

- వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే అన్ని సేవలు
- కూటమి హయాంలో మంగళం పాడేసిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు





లుకలాంలో రెడ్డి అచ్చాయమ్మకు ఇంటి వద్దే పింఛన్ ఇస్తున్న వలంటీర్ సంతోష్(ఫైల్)

వైఎస్సార్‌సీపీ హయాంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో ఇంటివద్దే ప్రజలకు కావాల్సిన అన్ని సేవలు అందేవి. పెన్షన్లు, రేషన్ సరుకులు, వైద్య సేవలు, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, విద్యార్థులకు పలు రకాల ధ్రువపత్రాలు తదితర సేవలు ఇంటి వద్దనే అందుకునేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే పథకాలు కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదు. ఆయా శాఖల ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వలంటీర్లను తొలగించి, గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలు చేపట్టింది. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఏ పని జరగాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ఉన్న వైద్య సేవలు ప్రభుత్వ ఆస్పత్రులకే పరిమితం చేశారు. నిన్న మొన్నటి వరకు ఇంటి వద్దకు వచ్చిన రేషన్ బియ్యం, ఇతర సరుకులు అందించే వ్యాన్లు రద్దు చేయడంతో రేషన్ బియ్యం కోసం కార్డుదారులు డీలర్ల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామ సచివాలయం నుంచి ఇంటి వద్దకు వచ్చే కుల, ఆదాయం వంటి పలు రకాల ధ్రువపత్రాల కోసం విద్యార్థులు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు మండిపడుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

తిరగాల్సిన దుస్థితి వచ్చింది



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో ఏదైనా పని కావాలనుకుంటే ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, ఆయా శాఖల ఉద్యోగులు చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. జగనన్న పాలనలో వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పనులు చేసేవారు. ఇప్పుడు అలాంటి పరిపాలన కరువైంది.

– ఈగల చిన్నారావు, బొత్తాడసింగి, ఎల్.ఎన్.పేట

గడప గడపకూ పాలన లేదు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు గడప వద్దకే పాలన వచ్చింది. గ్రామ వలంటీర్లు ఇంటికి వచ్చి అడిగి మరీ పనులు చేసుకుని వెళ్లేవారు. జగనన్న పాలనలో ఒంటరిగా ఉన్నవారితో పాటు వికలాంగులు, వృద్ధులకు ఎంతో మేలు జరిగింది. చంద్రబాబు పాలనలో అన్ని పనులకు తిరగాల్సి వస్తోంది.

– శివ్వాల షణ్ముఖరావు, పూశాం, ఎల్.ఎన్.పేట

పాతపట్నం నియోజకవర్గంలో...	
మండలం	మొత్తం కుటుంబాలు
మెళియాపుట్టి	11,153
హిరమండలం	11,732
ఎల్.ఎన్.పేట	10,126
కొత్తూరు	21,339
పాతపట్నం	19,837
నరసన్నపేట నియోజకవర్గంలో...	
నరసన్నపేట	28,110
జలుమూరు	21,007
సారవకోట	18,485
పోలాకి	22,090
ఆమదాలవలస నియోజకవర్గంలో...	
ఆమదాలవలస మున్సిపాలిటీ	10,225
ఆమదాలవలస	12,339
సరుబుజ్జిలి	8,845
బూర్జ	11,123
పొందూరు	19,242



ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే వచ్చి సేవలందిస్తున్న ఉద్యోగులు, వలంటీర్లు (ఫైల్)

పడిగాపులు కాస్తున్నాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ సరుకులు మా ఇంటి వద్దకే వచ్చేవి. ఇంటికి వచ్చి పిలిచి మరీ ఎటువంటి అవకతవకలు లేకుండా రేషన్ అందించేవారు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ మొదటికే కష్టాలు వచ్చాయి. ప్రతిరోజూ రేషన్ దుకాణం దగ్గరకు వెళ్లి, జనాలు ఉంటే తిరిగి వస్తున్నాం. పనులు మానుకొని వెళ్లాల్సి వస్తోంది. గడప వద్దకే రేషన్ సరుకులు అందించే పద్ధతే బాగుండేది.

– నక్క నరసింహులు, పొన్నాంపేట, ఆమదాలవలస మండలం

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



గత ప్రభుత్వంలో గ్రామాల్లో, వార్డుల్లో ప్రజలను వెతుక్కుంటూ ప్రభుత్వమే వచ్చి పథకాలు ఇచ్చేది. ప్రస్తుతం కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన దుస్థితికి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. గతంలో వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ పేరుతో వైద్యులు ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించేవారు. ప్రస్తుతం ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. వెళ్లినా ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, రోగులకు అవసరమైన మందులు ఉండడం లేదు. ప్రజలు ఈ పాలనపై విసుక్కుంటున్నారు.

– దుంపల చిరంజీవిరావు, లక్ష్మిడిపేట, ఆమదాలవలస మున్సిపాలిటీ

ఇంటి వద్దకే పథకాలు వచ్చేవి



వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని పథకాలు ఇంటి వద్దకే వచ్చేవి. వలంటీర్లు వచ్చి తలుపు తట్టి పథకాలు అందించేవారు. ఇప్పుడు అలా రావడం లేదు. ప్రధానంగా బియ్యం ఇంటి వద్దనే ఇచ్చేవారు. జూన్ నెల నుంచి పద్ధతి మార్చారు. కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. వలంటీర్లు ఉన్నప్పుడు అంతా బాగుండేది. ఇప్పుడు వారు లేని లోటు కనిపిస్తోంది.

– పి.ఎర్రయ్య, బడ్డవానిపే, ఉర్లాం

అందుబాటులో ఉండేవి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేవి. గ్రామాల్లోనే అందుబాటులో ఉండేవి. రైతులు ఎటువంటి కష్టపడాల్సి వచ్చేది కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంతా మారిపోయింది. ఎరువులు సకాలంలో అందకపోగా నరసన్నపేట, ఉర్లాం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో రైతులు సకాలంలో ఎరువులు వేసుకోలేకపోతున్నారు. ఒక యూరియా బస్తా కావాలంటే ఎంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

– బైరి శ్రీనివాసరావు, పారశిల్లి, నరసన్నపేట

పరిపాలన ఎటు పోతుందో



కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన ఎటు పోతుందో తెలియని దుస్థితి నెలకొంది. ప్రజల సమస్యలు పరిష్కారానికి ప్రాధాన్యత లేదు. రీసర్వే సమస్యలు పరిష్కారం పేరుతో జరిగిన గ్రామ సభల్లో రైతులు భూముల సంబంధిత సమస్యలు కోసం ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయింది.

– పెద్దకోట రాము, డొంకలబడవంజ, ఎల్.ఎన్.పేట

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆమదాలవలస: ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది



సరుబుజ్జిలి: యోగాసనాల్లో పాల్గొన్న విద్యార్థులు

సరుబుజ్జిలి: ప్రతి ఒక్కరూ యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీడీవో ఎం.పావని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, పలు శాఖల సిబ్బంది యోగాసనాల కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. నిత్య జీవితంలో యోగాను ప్రత్యేక అంశంగా భావించాలని సూచించారు.

ఆమదాలవలస: ఆరోగ్యవంతమైన జీవన శైలికి యోగా అవసరమని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణ ప్రధాన రహదారిపై యోగాపై అవగాహన ర్యాలీని మున్సిపల్ సిబ్బందితో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ర్యాలీ ప్రజల్లో యోగా వల్ల కలిగే లాభాలపై అవగాహన పెంపొందించేందుకు తోడ్పడుతుందన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత ఒత్తిడి దూరమై ఆరోగ్యకరంగా జీవితాన్ని కొనసాగించవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన ఏర్పరచుకొని ప్రతిరోజు క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు..?

- అధికారులు తీరుపై సర్వసభ్య సమావేశంలో అసహనం



నేలపై బైటాయించి నిరసన తెలియజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎల్.ఎన్.పేట: మండల సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలు పరిష్కారం కానప్పుడు ఈ సమావేశాలు ఎందుకంటూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు శాఖల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందని, సీడీపీవో పనితీరుపైన విమర్శలు వినిపిస్తున్నాయని మండిపడ్డారు. మెగా వాటర్ పథకం మరమ్మతుల పేరుతో రూ.83 లక్షలు ఖర్చు చేశారని, అయితే గ్రామాలకు తాగునీరు రావడం లేదని, రూ.83 లక్షలు ఖర్చు ఎక్కడ జరిగిందో చెప్పాలని చింతలబడవంజ సర్పంచ్ ఊట సత్యనారాయణ ప్రశ్నించారు. తమ గ్రామంలో భూములు సంబంధిత సమస్యలు ఉన్నాయని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా పరిష్కారం కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

అధికారులు రానప్పుడు మేమెందుకు..?

మండల సమావేశానికి అధికారులు రానప్పుడు తమనెందుకు పిలవాలని సభ్యులు నిలదీశారు. తామంతా పనుల్లేక వస్తున్నామా అని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై నిరసన తెలియజేస్తూ నేలపైన బైటాయించారు. ఏడాది కాలంలో మండలంలో సీడీపీవో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేశారో తెలియజేయాలని తురకపేట, యంబరాం, చింతలబడవంజ, ధనుకువాడ గ్రామాల సర్పంచ్‌లు ఎం.యోగీశ్వరి, వి.గోవిందరావు, వి.లక్ష్మి, దాలప్పలనాయుడులు డిమాండ్ చేశారు. సోమవారం నుంచి తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో పైడి శ్రీనివాసరావు తెలిపారు. వీధి దీపాలకు విద్యుత్ బల్బులు వేయడం తమ పనికాదని గ్రామ సచివాలయ విద్యుత్ శాఖ ఉద్యోగులు తప్పించుకుంటున్నారని సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. విద్యుత్ శాఖ ఎస్ఈతో మాట్లాడి జాబ్ చార్టు తెప్పించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో పేర్కొన్నారు. కాలనీలో ఇళ్లు కట్టిన వారికి బిల్లులు ఇవ్వడం లేదని, ఎవరైనా లబ్ధిదారులు బిల్లులు కోసం అడిగితే అధికార పార్టీ నాయకుల వద్దకు వెళ్లాలని హౌసింగ్ ఉద్యోగులు సలహా ఇవ్వడం విడ్డూరంగా ఉందని బొత్తాడసింగి సర్పంచ్ ఈగల భవానీ మండిపడ్డారు. కార్యక్రమంలో ఏవో పైడి లతశ్రీ, పశువైద్యాధికారి డాక్టర్ జి.కవిత, లక్ష్మీనర్సుపేట, తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ వసుధ, ఏపీవో వి.శ్రీదేవి, జెడ్పీటీసీ కిలారి త్రినాథు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం



ఆమదాలవలస రూరల్ మండలంలోని తమ్మయ్యపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం నిరుపయోగంగా ఉంది. గ్రామంలో ఉన్న పాఠశాలను వేరేచోటకు తరలించడంతో గతంలో ఉన్న పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకొస్తానని గతంలో అధికారులు పలుమార్లు చెప్పారు. కానీ ఇప్పటివరకు ఆ భవనం ఉపయోగంలోకి రాకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇప్పటికైనా అధికారులు ఈ భవనం వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

దరఖాస్తుల స్వీకరణ

బూర్జ: మండలంలోని ఓవీపేట ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 7, 8, 9 తరగతులకు మరియు ఇంటర్మీడియట్‌లో ఖాళీ అయ్యే సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎంఈవో రాంబాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక రోజు శిక్షణనిచ్చారు. ఎంఈవో మాట్లాడుతూ డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని సూచించారు. ఎక్కడా లోపాలు తలెత్తకుండా సక్రమంగా పథకం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కేశవరావు, రిసోర్స్‌పర్సన్ కౌశల్య, 57 పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్ఆర్ కాలనీలో ఉమా కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు ఆలయ అవరణలో సామూహిక కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా విశేష హోమాలతో పాటు సూర్య నమస్కారాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు మధ్యాహ్నం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. ఇప్పటికే పొలం పనులు ప్రారంభించిన రైతులు ఖరీఫ్ విత్తనాలు వేసుకునేందుకు వర్షం ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: తిమడాంలో కురుస్తున్న వర్షం

గ్రంథాలయాల సేవలు వినియోగించుకోవాలి



పాతపట్నం: విద్యార్థులతో వైద్యులు, అధికారులు

- ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

హిరమండలం: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల సేవలు వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి ఎర్రమ్మ సూచించారు. వేసవి శిబిరాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో గత కొద్దిరోజులుగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. శుక్రవారం ముగింపు సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారి రవి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, శాంతి నికేతన్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: గ్రంథాలయాలు విద్యార్థులకు వేసవిలో మరింత విజ్ఞానం పెంచుతాయని ఎంఈవోలు దేవేంద్రరావు, పద్మనాభరావు, నలంద ప్రిన్సిపాల్ ప్రతాప్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: పాఠకులు, విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని విశ్రాంత ఎంపీడీవో సలాన చిరంజీవి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ వైద్యుడు ఆర్.మల్లిఖార్జునరావు, పైల బాబ్జిలు మాట్లాడుతూ పిల్లలు వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు విశ్రాంత ఎంపీడీవో చిరంజీవి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు రాకేష్, పూర్ణిమ, సాయిలు, విశ్రాంత శాఖ గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, ప్రవీణ్, సంతోష్, మీనాకుమారి, రంజిత్, మోహనరావు, బోగేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయి. దీనిలో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను విశ్రాంత గ్రంథాలయ అధికారి శ్రీరాములు చేతులమీదుగా అందజేశారు.

సారవకోట: మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో ఎంఈవో ఎంవీ రమణ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇక్కడ జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయనతో పాటు లైబ్రేరియన్ సాయమ్మ తదితరులున్నారు.



మెళియాపుట్టి: బహుమతులతో విద్యార్థులు, అధికారులు



కొత్తూరు: బహుమతులు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు



సారవకోట: విద్యార్థులతో ఎంఈవో ఎంవీ రమణ తదితరులు



హిరమండలం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం